
## ● కథానిక

**పువ్వులకు రేకులెంత అందాన్నిస్తాయో బాల్యంతోబాటు తలమీద జుత్తు కూడా బాలలకు అంతే అందాన్నిస్తుంది. అటువంటి బాల్యాన్ని భ్రష్టు పట్టించడానికి గోచీలు కట్టి నిలబడిన ఆరడుగుల ఆ'గ్రహం' బంధుత్వమే తాతయ్య. కొందరు పిల్లలు తల్లిగండానో తండ్రి గండానో పుడితే బాల వెంకటేశ్వర ప్రసాదు తాత గండాన పుట్టాడు.**



– గోపాలుని జయరాజ చంద్ర

తాతయ్య కళ్ళన్నీ ముద్దుముద్దుగా పిలవబడే వెంకాయ్ తలమీదే కాపుర ముంటాయి.

ఆ వూళ్లో తాతయ్య భుజం మీద కండువాలా తిరుగుతుంటాడు కొండయ్య.

కొండయ్య కత్తిగాట్లు రుచిచూడని బాల్యం అరుదుగా అగుపిస్తుంది ఆ వూళ్లో –

'ఈ ఒక్కసారికీ వొదిలెయ్ తాతయ్యా! రేవు బళ్ళో జరగ బోయే సాంస్కృతిక పోటీల్లో వున్నాను తాతయ్యా,' ప్రాధేయ పడ్డాడు వెంకాయ్ తాత వెనకాల జేరి.

'నన్ను విసిగించకుండా ముందిక్కడి నుంచి వెళ్ళరా' కసురుకున్నాడు.

తాతయ్య ఆగ్రహానికి ఉగ్రరూపానికీ అవాక్కయిపోయాడు వెంకాయ్. బిక్కుబిక్కుమని దిక్కులు చూస్తూ గది మూలనక్కి నిల్చున్నారు ఎదిరించే ధైర్యం లేక.

ఇంతలో సుభద్రమ్మ వచ్చి తాతయ్య చేతికి కొన్ని కాగితాలు ఇచ్చి వెళ్ళిపోయింది. వెళ్ళేటప్పుడు వెంకాయ్ కళ్ళలోకి దైన్యంగా చూసింది.

కాగితాల్ని భద్రంగా మడిచి చంకలో పెట్టుకున్న తాతయ్య – 'చూడు కన్నా! మంచి ఘడియ చూడంగానే కొండిగాడికి కబురెడతాను మారాం చేయకుండా చేయి చేసుకోవాలి! తెలిసిందా!' అన్నాడు అనునయంగా.

'పందూ! కాన్నా! అంటూ ముద్దు ముద్దుగా చెక్కించేస్తాడు ముసలోడు' మనసులోనే తిట్టుకున్నాడు వెంకాయ్.

అదిగ్రహించిన తాతయ్య 'ఏంట్రోయ్' పెదిమలాడుతున్నాయి శబ్దం మాత్రం వినపడటంలేదు' అన్నాడు కళ్ళజోడు లోంచి మనవడి వంక చూస్తూ.

'అబ్బే! ఏంలేదు తాతయ్యా! నీ చేతిలో ఆకాయితాలేంటా? అని ఆలోచిస్తున్నానంతే' అన్నాడు ముఖం నిండా నవ్వు పులుముకుని.

'ఇది పంచాంగంరా పిచ్చి సన్నాసీ! పంచాంగం' అన్నాడు. కాగితాల కట్ట చూపిస్తూ. ఆ సమయంలో గర్వం తొంగి చూస్తోంది తాతయ్య ముఖంలో.

అదే అదనుగా తీసుకున్న వెంకాయ్ చిన్నగా అడుగులో అడుగేసుకుంటూ మళ్ళీ తాతయ్య దగ్గరకొచ్చి –

– తాతయ్యా ! ప్లీజ్! ఈ ఒక్క సారికే టౌనులో చేయించుకుంటానే!' పాతపాటనే కంటిన్యూ చేసాడు తన చిన్నారి చేతుల్ని తాతగడ్డం క్రింద వుంచి.

కానీ తాతయ్య చూపులన్నీ పంచాంగం మీదనే ప్రసరిస్తున్నాయి. అది భరించలేని వెంకాయ్ తాతయ్యా అన్నాడు అసహనంగా.

'ఊ! ఏంటిరా మళ్ళీ గొడవ' ఈసారి తాతగొంతులో వ్యంగ్యం. 'అక్కడైతే గిర్రుగిర్రున రంగులరాట్నం మల్లే తిరిగే కుర్చీల్లో కూర్చోబెట్టి చేస్తారంట' చేతి వేళ్ళని గాలిలో గుండ్రంగా తిప్పుతూ కొత్త ప్రయత్నం చేసాడు వెంకాయ్.

అయినా తాత నిర్ణయంలో ఏమాత్రం మార్పులేకపోగా 'కావాలంటే వచ్చే దారం సంతలో పావలా యిచ్చి రంగులరాట్నం తిరుగుదువు గానిలే' అంటూ మనవడి ప్రయత్నం మీద నీళ్ళు జల్లాడు.

అయినా పట్టు వదల్లేదు వెంకాయ్ 'కరెంట్ మీద చేస్తారంట తాతయ్యా ఆసలు చేసినట్లే తెలవదంట కుర్చీయే తిరుగుతుందంట' ఏదో కొత్త విషయం చెప్పినట్లు చెప్పాడు.

**న్యూజెర్సీ కథల పోటీలో రూ 1000లు బహుమతి పొందిన కథ**

'భడవకానా! బాగా మాటలు నేర్చావురా! నువ్వు. ఇందాకటి నుంచీ చూస్తున్నాను. టౌను టౌనని బెక బెకమంటూ అరుస్తున్నావు కప్పలా! టౌన్లో చేయించుకుంటే రోగాలొస్తాయని నాన్న చెప్పలా? అక్కడ శుభ్రం తక్కువంట పైగా మీ నాన్న క్కూడా మిలట్రీలో బుర్రమీద బొచ్చేబొర్లించే చేస్తారంట' హుంకరించాడు తాతయ్య.

వెంకయ్యలో నదురు బెదురు లేక పోగా – టౌన్లో వాళ్ళందరూ మన వూరొచ్చి కొండయ్య తగ్గరే చేయించు కుంటున్నట్లు చెప్తావేంటి తాతయ్యా' అని సమాధానం చెప్పి తాత కళ్ళల్లోకి సూటిగా చూశాడు.

'ఈ మాటలేకేం కానీ బుద్ధిగా వెళ్ళి పడుకో. రేప్పొద్దున్న ఏడూ నలభై రెండుకల్లా రమ్మనమని రంభతో కబురెడతానులే! చాలా దివ్యంగా వుంది ముహూర్తం. తలెంత మాసిపోయిందో చూడు' అన్నాడు చేతికర్ర సాయంతో లేస్తూ.

'తాతయ్య నా అవమాన సభకి రంభ కూడా ఎందుకులే' నసిగాడు వెంకాయ్

'చాల్లేరా అందగాడా! సంబడం చాలుగానీ పోయి పడుకో! వెంకాయ్ అక్కడి నుంచి కదలకుండా చలికాలంలో జుత్తు ఆలస్యంగా పెరుగుతుందని మా సైన్సు మాస్టారు చెప్పారు అన్నాడు.

"అయితే పంటలు తాత గొంతులో ఈసడింపు.

'మరి ఈ మధ్యనే గదా! నేను చేయించుకుంది' అని రెండు వేళ్ళ తోటీ తన తలవెంట్రుకల్నీ నిటారుగా నిలబెడుతూ చూపించాడు వెంకాయ్.

'ఏడిశాడు! వాడి సైన్సంతా ఈ పంచాంగంలో ఎవ్వడో రాసేశాను కానీ, వాడ్ని కూడా తీసుకునిరా! మన కొండిగానికి వేసేస్తాను కసి దీర్చేసుకుంటాడు' అని మనవడి వంక తీక్షణంగా చూస్తూ నడుచుకుంటూ పెరట్లోకి వెళ్ళిపోయాడు.

తాతయ్య అటువెళ్ళిపోగానే లోపలికెళ్ళి తన తల్లిదగ్గరచేరి మారాం చేయసాగాడు వెంకాయ్. తాతయ్య వొకళ్ళు చెబితే వినేరకం కాదుగదరా! నోరుమూసుకుని చేయించుకోవాల్సిందే తప్పదు' అని సముదాయిం

చింది తల్లి. కొండయ్య మిషన్‌తో తలంతా దున్నేస్తాడని అతని దగ్గర చేయించుకున్న మర్నాడు క్లాసు పిల్లలంతా గోల చేస్తుంటారని కళ్ళనీళ్లు పెట్టుకున్నాడు వెంకాయ్. ఆమె తన నిస్సహాయతను వెళ్ళబుచ్చింది.

ప్రొద్దున్నే నిద్రలేచిన వెంకాయ్‌కి వీధి గుమ్మం లోంచి లోపలికొస్తున్న కొండయ్య కనిపించాడు.

తిన్నగా వేపచెట్టు క్రింద సెటిల్ అయ్యాడు కొండయ్య. చంకలో పొది తీసి నేలమీద పెట్టి లోపల పనిముట్లను తనచుట్టూ గుండ్రంగా పరిచాడు.

అది చూస్తున్న వెంకాయ్ మనసులో అలజడి ప్రారంభమయింది. నిస్సహాయంగా కిటికీలోంచి చూస్తూ నిలబడ్డాడు.

అకస్మాత్తుగా వెంకాయ్ భుజం మీద ఏదో బరువుగా పడేటప్పటికి వులిక్కిపడి చూశాడు. ఓ చెయ్యి వుంది. ఇంకాస్త తిరిగి చూస్తేగానీ చెయితాలూకు తాతయ్య కనబడలేదు. వెలిసిపోయిన చొక్కానిక్కరూ మనవడికిచ్చి త్వరగా మార్చుకుని వెళ్ళి కూర్చోమని ఆర్డరేసి వెళ్ళిపోయాడు.

వెంకాయ్‌కి వుక్రోషం ముంచుకొచ్చినా చేసేదిలేక తాతయ్య చెప్పినట్లు చేసి కొండయ్య ముందెళ్ళి నిలబడ్డాడు.

ఆదేశాల కోసం ఎదురుచూస్తున్న కొండయ్య పీరజవానులా వెంకాయ్ తలని ఒక్క వుదుటున గుంజుకుని తన వొళ్లో గుచ్చుకున్నాడు.

కొండయ్య వొళ్లో వెంకాయ్ శిరస్సు వధ్యశిల మీద తొండలా వుంది.

కాసేపటి తర్వాత క్లిక్...క్లిక్.. మన్న శబ్దం వినబడింది వెంకాయ్‌కి. నల్లని తుమ్మెద రెక్కల్లాంటి తన వెంట్రుకలు నేలరాలడం తెలుస్తోంది అతనికి. ఆపుకోలేకపోయాడు. అంతే...' ఘోరం తాతయ్యా..! అని అరవడానికి ప్రయత్నం చేసి విఫలుడయ్యాడు.

'కదలకండి బాబూ తెగుద్ది' అని తలను ఇంకా గట్టిగా అదిమి పట్టుకున్నాడు కొండయ్య.

వెంకాయ్ మనసంతా చిందరవందరగా వుంది. జుత్తు పోతోందనే బాధ వొకప్రక్కనయితే మరొకప్రక్క కొండయ్య తొడల మధ్య నుంచి విరజిమ్ముతున్న దుర్గంధాన్ని భరించలేకుండా వున్నాడు.

కాసేపటి తర్వాత కత్తెరె ఆడించడం ఆపేశాడు కొండయ్య. తలపైకి తీసి చేతికో పగిలిన అద్దం ముక్క ఇచ్చాడు వెంకాయ్‌కి.

'అబ్బాయిగారూ సరిగా చూసుకున్నారా?' అడిగాడు కొండయ్య.

'ఏం మిగిలిందని చూసుకోడానికి' పొడిపొడిగా వుంది వెంకాయ్ సమాధానం.

'ఇదంతా మామూలే గదండీ తమరు మోర కొంచెం పైకెత్తండి' అన్నాడు కొండయ్య.

'తొందరేంటి కొండాయ్' వెంకాయ్ సమాధానంలో విసుగు ధ్వనించింది.

'అవతల తాతయ్యగారు చూపులతోనే చుట్ట అంటించుకుంటున్నారండీ' అని అన్ని కోణాల నుంచీ వెంకాయ్ తలని పరీక్షించిన పిదప చేతిలో వున్న కత్తెర, దువ్వెన్న కింద పారేసాడు కొండయ్య. వెంకాయ్ తలని తిరిగి కాళ్ళ మధ్య బంధించాడు. వెంకాయ్ ఇంకా పూర్తిగా వూపిరి పీల్చుకోలేదు.

చిక్...చిక్... మని ఏదో వల్చటి శబ్దం వినిపించింది. తల తిప్పి చూద్దామంటే.. ఊహు...కదలందే. పట్టకారులోన ట్టులా ఇరుక్కుపోయింది. వెంకాయ్ తలని మిషన్‌తో చెక్కేసిన తర్వాత అలిసిపోయిన కొండయ్య చేతిలో మిషన్ కింద పడేసాడు. కాళ్ళు పట్టుసడలించాడు. తలపైకెత్తిన వెంకాయ్ ముఖానికి పట్టిన చమటని చొక్కాతో తుడుచుకున్నాడు.

'బాబు తమరింక ఎల్లొచ్చండీ తవరెళ్ళి తమ్ముడిగారిని పంపండి' అన్నాడు కొండయ్య.

అది గమనించిన తాతయ్య 'వొరే శీనుగా' అని కేకేశాడు. పక్కనే ఆడుకొంటున్న శీను పరుగెత్తుకుంటూ తాతయ్య దగ్గరకొచ్చాడు. 'అటెళ్ళి కూర్చొని క్రాఫింయించుకోరా' వేపచెట్టు వైపు చూపించాడు. తాతయ్య.

అంతా గమనిస్తూనే వున్నాడు వెంకాయ్. తనతోబాటు బంగారం వంటి తమ్ముడి తల కూడా నాశనం కాబోతోంది. ఏదో ఒకటి చేసి ఈ దుర్మార్గం ఆపాలి. పాదరసంలా పని చేస్తోంది వెంకాయ్ బుర్ర. అంతే చటుక్కున పరుగెత్తుకుంటూ వెళ్ళి దగ్గర్లో వున్న కొబ్బరిచెట్టు ఎక్కేసాడు వెంకాయ్. అతని వంక ఆశ్చర్యంగా చూశాడు కొండయ్య. వెంకాయ్ చెట్టు ఎందుకు ఎక్కిందీ అర్థం కాలేద తనికి. పడతావేమోకిందకి దిగమన్నాడు తాతయ్య.

అరిచిగీపెట్టినా దిగను పొమ్మన్నాడు వెంకాయ్. 'లేచి వొచ్చానంటే వాలుగు తగిలిస్తాను తెలుసా? గట్టిగా అరిచాడు తాతయ్య.

'తమ్ముడి తలమీద కత్తి పడిందో కిందకి దూకి చచ్చిపోతానంతే. ఆ...! నా మీద వొట్టే' బెదిరించాడు వెంకాయ్. ఏం చేయాలో పాలుపోక అచేతనంగా వుండిపోయాడు తాతయ్య.

అది అనువుగా తీసుకున్న వెంకాయ్ 'నన్ను చేసిన ఆగం చాలు. వాడి తలను కూడా ఎందుకు నాశనం చేస్తారు. దుర్మార్గం ఆపకపోతే ఖచ్చితంగా దూకేస్తాను' బెదిరింపులో బలం పెరిగింది.

కొడుకు మాట వినబడి వంటింట్లో పనిచేసుకుంటున్న తల్లి ఆదుర్దాగా పరుగెత్తుకుంటూ వచ్చి దోడ్లో నిలబడింది. అది గమనించిన తాతయ్య తల అటు తిప్పి చూశాడు. ఆమె చూపులు అర్థిస్తున్నట్లుగా వున్నాయి. అయినా తాతయ్య మొండిగా లేచి నిలబడబోయాడు. రౌద్రంగా వుంది రూపం. జరగబోయేది పసిగట్టిన కొండయ్య 'అయ్యగారూ' అని కేకేశాడు. అందరూ అటు తిరిగి చూశారు.

పసి మనసు కట్టబడినట్టుంది. తమరు చేసింది చాలయ్యా చాలు అనేసి చకచకా అడుగులేసుకుంటూ వెళ్ళి పొదిలోని మిషనూ, కత్తెర చిర్నవ్వుతో బావిలోపడేశాడు. ఈ హఠాత్పరిణామానికి వెంకాయ్ ముఖం వెలిగిపోయింది.

తిరిగి వెనక్కి నడుచుకుంటూ. వచ్చిన కొండయ్య 'శీను బాబూ తమరెళ్ళి ఆడుకోండి. టౌన్లో వున్న మా అబ్బాయి వచ్చి మీకు అందంగా క్రాఫింగు సేస్తాడు! అని అభయమిచ్చాడు.

◆

మినీ కథ

# "మేడ్ ఫర్ ఈచ్ అదర్"

సుందరరావు తన పెళ్ళిచూపులకు మేనమామ రంగారావుతో కలిసి సీతాపతి ఇంటికి వెళ్ళాడు. సీతాపతి, రంగారావు ప్రక్కప్రక్క సోఫాలో కూర్చోగా మరో సోఫాలో సుందరరావు దర్జాగా కూర్చున్నాడు. సుందరరావును చూడగానే తమ అమ్మాయికి తగ్గ అందచందాలు, మంచి ఆస్తిపాస్తులు గల అల్లుడు దొరికాడని, ఈ సంబంధం జారవిడుచుకోరాదని సీతాపతి మనసులో అనుకున్నాడు.

బంగారు మేనిచ్ఛాయతో కళ్లు జిగేల్‌మనిపించే పట్టుచీర కట్టుకుని ట్రేలో కాఫీ కప్పలతో స్నేహితురాలితో బాటు వచ్చింది విశాలాక్షి. అమ్మాయిని చూసి తన మేనల్లుడికి తగ్గ జోడి, మేడ్ ఫర్ ఈచ్ అదర్ అని రంగారావు అనుకున్నాడు. రంగారావుకే కాదు ఆ ఇద్దరిని చూసిన సీతాపతికి, బంధువర్గానికి మనసులో ఆ భావమే కలిగింది. తండ్రికి, రంగారావుకి కాఫీకప్పులు అందించి సుందరరావుకు కాఫీ ఇస్తూ కన్నుగీటింది విశాలాక్షి. తనేం తక్కువ అన్నట్టు సుందరరావు గాలిలోకి ముద్దు విసురుతున్నట్టు అధరాలను సున్నలా ముడిచి ముందుకు చాపాడు. అమ్మాయి కన్నుగీటడం చూసిన రంగారావు, అబ్బాయి గాలి ముద్దులు విసరడం చూసిన అమ్మాయి తరపువారు వధూవరులు ఒకరినొకరు నచ్చినందువల్లే ఇలా చిలిపిగా ప్రవర్తించారేమో అని అనుకున్నారు. పెళ్ళిచూపుల తంతు ముగిశాక సీతాపతి వారిని సాగనంపడానికి కాంపౌండ్ దాటి వచ్చి రంగారావుతో మెల్లిగా ఇలా అన్నాడు "మా అమ్మాయి అందాల బొమ్మ. కానీ చిన్నతనం నుంచి చీటికి మాటికి కన్నుగీటే అలవాటుంది. అదొక్కటే లోపం" అని. రంగారావు కూడా తన మేనల్లుడికి మాటిమాటికి గాలిముద్దులు వదిలే వింత అలవాటుందని చెప్పగానే ఇరువురు కూడా ఈడు జోడులోను వింత అలవాట్లలోను మేడ్ ఫర్ ఈజ్ అదర్ అనుకున్నారు.



—సంగంబండ జగన్నాథరెడ్డి